క్లుప్తంగా

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

కంబాలచెరువు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాలను పురస్కరించుకుని ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినులకు బుధవారం వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మహిళల భద్రత, హక్కులు – సాధికారత, మహిళా చట్టాలు, పోక్సో చట్టం, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ వంటి విషయాలపై ఈ పోటీలు జరిగాయి. విద్యార్థులకు మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, హక్కులపై అవగాహన కల్పించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పోలీసు అధికారులు తెలిపారు. మహిళా రక్షక్ వాట్సాప్ నంబర్ 94932 06006, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, పోలీస్ హెల్ప్ లైన్ 112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 నంబర్లపై అవగాహన కల్పించారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



మహిళలను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్కేవీటీ కళాశాలలోని ఆనందా గార్డెన్స్‌లో బుధవారం మహిళా దినోత్సవం, వృద్ధులకు పింఛన్ల జరిగింది. క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీర రాఘవమ్మ మాట్లాడుతూ మహిళలందరూ చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. వెలగల పద్మావతి తన తల్లి పడాల లక్ష్మి తులసి చేతుల మీదుగా వృద్ధాప్య పింఛన్ల కోసం రూ.5 వేలు, యేరుకొండ రాధాకుమారి రూ.5 వేలు అందించారు. బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న కడియపు దుర్గేష్ అనే విద్యార్థికి అయినాపురపు వెంకటలక్ష్మి, చిదంబరరావు దంపతులు రూ.20 వేలు అందించారు. వసుంధర, ఏటీవీ బాబా దంపతులు తమ 61వ వివాహ దినోత్సవం సందర్భంగా వృద్ధులందరికి చీరలు పంపిణీ చేశారు. 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.40 వేలు వృద్ధాప్య పింఛన్ల రూపంలో పంపిణీ చేశారు. అనంతరం ముఖ్య అతిథులను క్లబ్ సభ్యులు సన్మానించారు.

పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి

- వసూలు వేగవంతం చేయాలి
- అధికారులతో కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆర్థిక పరిపుష్టి కోసం ఆస్తి పన్నులు, నీటి చార్జీలు, షాపు అద్దెలను ఈ నెల 31వ తేదీ లోపు వందశాతం వసూలు చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది, సచివాలయ పరిపాలనా కార్యదర్శులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ట్రెజరీ కౌంటర్‌కు అదనంగా నగరంలో ఎనిమిది చోట్ల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో ఇళ్ల యజమానులు తమ పన్నులను చెల్లించవచ్చన్నారు. రెవెన్యూ విభాగంలో గుమస్తాలను కౌంటర్లలో పన్నులు వసూలు చేయటానికి నియమిస్తున్నామన్నారు. ప్రజలకు పన్ను చెల్లింపుపై అవగాహన కల్పించడానికి మైకు ద్వారా ప్రచారం చేస్తున్నామని, పన్నుల వసూలు తక్కువగా ఉన్న సచివాలయాలకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. నీటి చార్జీల వసూలుకు ఎమినిటీస్ కార్యదర్శులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఖాళీ స్థలాల పన్నులను యజమానులు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, రెవెన్యూ అధికారి – 2 సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని స్వచ్ఛ రాజమహేంద్రవరం ప్రతిష్ఠను నిలబెట్టాలని కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో యువత కీలకపాత్ర పోషించాలని కోరారు. దీనిలో భాగంగా నగరంలో 10 కాలేజీలకు వెళ్లి సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నామన్నారు. ఇప్పటివరకూ నగరంలో 23 వేల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు.

ఎస్కేఆర్ కళాశాలలో వార్షిక విద్యా ఆడిట్



నిపుణులకు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ రాఘవకుమారి తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం వార్షిక విద్యా ఆడిట్ జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి అధ్యక్షతన జరిగిన ఈ ఆడిట్‌లో కళాశాల విద్యా ప్రమాణాలను డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ నియమించిన నిపుణుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ బృందంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన డాక్టర్ ఎ.అన్నపూర్ణ, పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డాక్టర్ వి.నారాయణరావు పాల్గొన్నారు. కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించి, బోధన, అభ్యాసన, పరిశోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల పురోగతి వంటి వివిధ అంశాలను సమీక్షించారు. ముఖ్యంగా, కళాశాల వార్షిక పాఠ్య ప్రణాళికలు, అధ్యాపకులు నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సులు, ఐసీటీ సాధనాల వినియోగం, అంతర్గత మార్కులు, సెమినార్లు, అసైన్ మెంట్లు, విద్యార్థుల ప్రాజెక్ట్ పనులు, ఇంటర్న్‌షిప్ నివేదికలు, పరిశోధనా ప్రచురణలు, కంప్యూటర్ ల్యాబ్‌లు మొదలైన వాటిని వారు పరిశీలించారు. నిపుణుల బృందం వీటిపై నివేదికను డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్‌కు సమర్పించనుంది.

నిరుద్యోగులూ.. వదంతులు నమ్మొద్దు



షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: సోషల్ మీడియా ద్వారా రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో వివిధ ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలంటూ వస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని రాష్ట్ర ప్రజా రవాణా విభాగం డీపీటీఓ షర్మిల అశోక బుధవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన వారికి నెలకు రూ.23 వేల నుంచి రూ.58 వేల జీతం ఇస్తామంటూ 91335 66236 నెంబరును సంప్రదించాలంటూ తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఈ ప్రచారంతో ఏపీఎస్ ఆర్టీసీకి ఏ విధమైన సంబంధం లేదని స్పష్టం చేశారు. వీటిని నమ్మి నిరుద్యోగ యువత మోసపోవద్దని ఆమె పేర్కొన్నారు. ఈ విషయమై దర్యాప్తు చేపట్టి చేపట్టాలని రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరం



శిబిరానికి వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్, డాక్టర్ పర్వత వర్ధిని

సీటీఆర్ఐ: క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరమని గైనకాలజిస్ట్ డాక్టర్ చందన పర్వత వర్ధిని అన్నారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాగ్న మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఆ హాస్పిటల్లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ చందన పర్వత వర్ధిని మాట్లాడుతూ క్యాన్సర్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించడం ద్వారా చికిత్స అందజేయవచ్చన్నారు. డాక్టర్ వినయ్ మోహతా మాట్లాడుతూ సుమారు 180 మంది మహిళలు పరీక్ష చేయించుకున్నారని, రిపోర్టులను మహిళా దినోత్సవం రోజున అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆబోతును చంపేశారని ఫిర్యాదు

కడియం: వీరవరం గ్రామంలో సంచరించే ఆబోతును కొందరు యువకులు చంపేసి, పొట్టిలంక సమీపంలోని శ్మశానవాటికలో పూడ్చిపెట్టారంటూ పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు బుధవారం కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండవ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ రిపోర్టు ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే విధానాల్ని విరమించుకోవాలన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందించారు.

పార్డ్ ఇండియా సేవలు అభినందనీయం



అంబులెన్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, సినీ నటుడు బాలాజీ

రాజమహేంద్రవరం రూరల్: పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఆ సంస్థకు ఈసీఈ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో అందించిన అంబులెన్స్ సర్వీసును బుధవారం కలెక్టరేట్‌లో ఆమె ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్డ్ ఇండియా నిర్వహిస్తున్న ఆఫ్టర్ స్కూల్ ఎడ్యుకేషన్, కుట్టుమెషీన్ కేంద్రం, ఆరోగ్య శిబిరాలు, భోజనం సరఫరా, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, కంప్యూటర్ శిక్షణ చాలా మంచి కార్యక్రమాలు అని కొనియాడారు. గోపాలపురం నియోజకవర్గంలో మారుమూల ప్రాంతంలో ఉన్న నిరుపేద ప్రజలకు ఉచిత అంబులెన్సు సర్వీస్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పార్డ్ ఇండియా అంబాసిడర్, సినీనటుడు బాలాజీ, పార్డ్ ఇండియా నల్లజర్ల శాఖ అధ్యక్షుడు మహ్మద్ ఇలియాస్ షరీఫ్, బీజేపీ నాయకులు యానాపు ఏసు, భోగవల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత భరత్‌రామ్‌దే

- ఆయనపై విమర్శలు చేస్తే సహించం
- కూటమిపై బిల్డర్ చిన్నా ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న బిల్డర్ చిన్నా

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌కే దక్కుతుందని, ఆయనపై బురద జల్లే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని వైఎస్సార్ సీపీ సిటీ అధికార ప్రతినిధి బిల్డర్ చిన్నా అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో సిటీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై విమర్శలు చేసిన టీడీపీ నాయకుడు బుడ్డిగ రాధాపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, బీజేపీ నాయకులు ప్రజలు మోసం చేశారన్నారు. బుడ్డిగ రాధా మళ్లీ మార్గాని భరత్ రామ్ జోలికొస్తే ఆయన ఇంటి వద్ద ధర్నా చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. గౌతమీ కో ఆపరేటివ్ సూపర్ బజార్ స్థలం విషయంలో రూ.5 కోట్లు భరత్ రామ్ తీసుకున్నారని ఆరోపించారని, దమ్ముంటే దాన్ని నిరూపించాలన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ కట్టిన ఘనత మార్గాని భరత్ రామ్‌కే దక్కుతుందన్నారు. గోదావరిలో పడవ ప్రమాదం జరగడం బాధాకరమని, లంకల్లో పేకాట, కోడిపందాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. సోడదాసి సుందర్ సింగ్ మాట్లాడుతూ కాశీ నవీన్ అన్ని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. చిట్టూరి ప్రవీణ్ చౌదరిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు కొమ్మోజు దుర్గారావు పాల్గొన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో మెలగాలి



సదస్సులో మాట్లాడుతున్న విజయకుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బాలికలు విద్యలో రాణించడమే కాకుండా ఆత్మవిశ్వాసంతో మెలగాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయ కుమారి అన్నారు. గణేష్ చౌక్‌లోని ప్రభుత్వ వెనుక బడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహంలో బుధవారం సాయంత్రం ఆత్మ స్థైర్యం, స్వీయ రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలికలు తమను తాము రక్షించుకునే నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలని తెలిపారు. ఎల్‌సీపీవో ఎస్ఎస్ గౌరి మాట్లాడుతూ మహిళల చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.శశాంక, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్యాల సుబ్బారావు, ఎల్‌వో ఎ.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త చంటికి నివాళి



చంటి మృతదేహంపై వైఎస్సార్ సీపీ పతాకాన్ని కప్పుతున్న శ్రీనివాసరెడ్డి

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ కార్యకర్త పులిదిండి జయప్రకాష్ (చంటి) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు, గొందేసి పూర్ణచంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ గొందేసి శ్రీనివాసరెడ్డి బుధవారం చంటి మృతదేహానికి నివాళులర్పించారు. మృతదేహంపై వైఎస్సార్ సీపీ పతాకాన్ని కప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల అను, రెడ్డి ప్రసాద్, గునిపే అశోక్, చాటకాల చంటి, సీతారామ్ చరణ్, మురళి పాల్గొన్నారు.

జయప్రద సోదరుడి అస్థికల నిమజ్జనం



అస్థికలను నిమజ్జనం చేసేందుకు పడవలో వెళుతున్న జయప్రద, మేనల్లుడు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక పుష్కరాల రేవు వద్ద గోదావరిలో బుధవారం సినీ నటి జయప్రద సోదరుడు రాజబాబు అస్థికలను నిమజ్జనం చేశారు. ముందుగా రేవు వద్ద రాజబాబు కుమారుడు ముత్తు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వీటిని జయప్రద దగ్గరుండి జరిపించారు. అనంతరం పడవలో వెళ్లి గోదావరిలో అస్థికలను నిమజ్జనం చేశారు. గత నెల 27వ తేదీన రాజబాబు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా.. జయప్రదను పుష్కరాలరేవులో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పరామర్శించారు

చట్టాలపై అవగాహన అవసరం



విజేతలతో ఎస్సై దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు

కడియం: ఆడపిల్లలకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్సై దుర్గాప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కడియం పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవంలో ఎస్సై పాల్గొన్నారు. హెచ్ఎం రఫీయుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, లీలావతి, పద్మజ, కానిస్టేబుల్ భీమారావు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన దీపిక, గౌతమి, హారిక, సత్య ప్రియాంక, స్నేహ అక్షయ, హేమశ్రుతికి బహుమతులు అందజేశారు.

లైన్‌మన్ వెంకన్న దొరకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న లైన్‌మన్ వెంకన్న దొర

ధవళేశ్వరం: గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మన్ సీహెచ్ వెంకన్న దొరకు జాతీయ లైన్‌మన్ దివాస్ అవార్డు లభించింది. ఆ శాఖ ఎస్ఈ కె.తిలక్ కుమార్ ఆధ్వర్యంలో ఈఈ నక్కపల్లి శామ్యూల్ చేతుల మీదుగా వెంకన్న దొర అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏఈ బెల్లపు శ్రీనివాస్ మాట్లాడుతూ వెంకన్న దొర నిబద్ధత, అంకితభావంతో విధులను నిర్వహిస్తారని కొనియాడారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

కంబాలచెరువు: తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. గ్రేస్ అకాడమీకి చెందిన హెచ్ఆర్ జోనాథన్ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 94 మంది హాజరయ్యారు. వారిలో 52 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని పోస్టులను బట్టి రూ.2.20 లక్షల నుంచి రూ.3.20 లక్షల వార్షిక వేతనం అందుతుంది. కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.రాజేష్, ప్లేస్‌మెంట్ కమిటీ సభ్యులు బి.హర్షిత, టి.అనూహ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ షాపు నిర్వాహకుడి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: అన్నపూర్ణమ్మపేటకు చెందిన సెల్‌ఫోన్ నిర్వాహకుడు 38 ఏళ్ల గంట్ల సురేష్ ఈ నెల 2వ తేదీన అదృశ్యమయ్యాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఈ మేరకు అతడి అన్నయ్య వరహాలు బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై కేశవ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జయంత్యుత్సవం

సీటీఆర్ఐ: సంప్రదాయ కవిత్వంలో ఆధునికవాది మధునాపంతుల అని సంస్కృత ఆచార్యులు ఏవీఎస్‌టీ శ్రీనివాస శర్మ అన్నారు. స్థానిక ఎస్కేవీటీ ప్రభుత్వ కళాశాల, కళా గౌతమి ఆధ్వర్యంలో బుధవారం మధునాపంతుల జయంతి నిర్వహించారు. ఈ సభకు తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అధ్యక్షత వహించారు.

గుర్తు తెలియని మహిళ మృతి



రాజమహేంద్రవరం రూరల్: కాతేరు వద్ద గామన్ బ్రిడ్జిపై రోడ్డు దాటుతుండగా బుధవారం ఉదయం మోటార్ సైకిల్ ఢీకొనడంతో గుర్తుతెలియని మహిళ మృతి చెందిందని త్రీటౌన్ ఎస్సై వి.అప్పలరాజు తెలిపారు. కాతేరు వీఆర్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీలో ఉంచినట్టు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావు 94407 96532, ఎస్సై అప్పలరాజు 94903 45517 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

కడియం: కడియపులంక సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఈఈ జేపీపీ నటరాజన్ తెలిపారు. ఈ నేపథ్యంలో కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, పొట్టిలంక గ్రామాల్లోని వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, రైతులు సహకరించాల్సిందిగా కోరారు.

మతోన్మాదాన్ని ఎదుర్కోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వనజ

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి ప్రజాస్వామిక లౌకిక శక్తులు ఏకం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మూడు రోజుల పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల వర్క్‌షాప్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో పౌరులందరికీ సమాన అవకాశాలు అందడం లేదన్నారు. దోపిడీ నుంచి శ్రామిక వర్గం విముక్తి కోసం పార్టీ కార్యకర్తలు సైద్ధాంతికంగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు